ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 37 | పేజీలు: 6 | వెల: రూ.3/- | గురువారం 21 మే 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# 'మెలోడి గిఫ్ట్' వీడియోకు గంటల్లోనే 100 మిలియన్ వ్యూస్



### అమాంతం పెరిగిన 'పార్లే' షేర్లు... ఇటలీ ప్రధాని జార్జియా మెలోనికి 'మెలోడీ' చాక్లెట్ ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చిన ప్రధాని మోదీ

### ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ వీడియోకి ఏకంగా 100 మిలియన్ వ్యూస్

**హైదరాబాద్, మే 21 (ప్రభాత ఉదయం)**

ఇటలీ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనికి 'మెలోడీ' చాక్లెట్ ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకున్నారు. అయితే, ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతోంది. పెట్టిన కొన్ని గంటల్లోనే ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ వీడియోకి ఏకంగా 100 మిలియన్ వ్యూస్ వచ్చాయి. అలాగే, ఎక్స్‌లో 7.4 మిలియన్ పైగా వ్యూస్ రావడం విశేషం. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ తన ఇటలీ పర్యటనలో ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనికి ఒక మధురమైన కానుకను ఇచ్చారు. రోమ్ పర్యటనలో ఉన్న ఆయన భారత్ నుంచి ప్రత్యేకంగా తీసుకెళ్లిన 'పార్లే మెలోడీ' చాక్లెట్ ప్యాకెట్‌ను మెలోనికి బహుమతిగా ఇచ్చారు. ఈ ఆనందకరమైన క్షణాలకు సంబంధించిన వీడియోను ఇటలీ ప్రధాని మెలోని తన సోషల్ మీడియా ఖాతా ఎక్స్‌లో పంచుకున్నారు. మరోవైపు,..మిగతా 2లో

### అంతర్జాతీయ స్థాయి సంస్థలను

# ఫ్యూచర్‌సిటీకి తీసుకురావాలి

### ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పరిశ్రమల శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

- ఫ్యూచర్ సిటీలో భూముల కేటాయింపు, పరిశ్రమల ఏర్పాటుపై చర్చ
- బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ పనులను తక్షణమే ప్రారంభించాలి
- రాష్ట్రంలో 1500 ఎకరాల విస్తీర్ణంలో 'డేటా సిటీ' ఏర్పాటు
- హైదరాబాద్ వెలుపల జిసిసి కేంద్రాల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచన



**హైదరాబాద్, మే 21 (ప్రభాత ఉదయం)**

ఐటీ రంగాన్ని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు విస్తరించే దిశగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ వెలుపల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేసే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు. నిజామాబాద్,కరీంనగర్,వరంగల్ హైవేల వెంట జీసీసీలు, ఐటీ సంస్థలు ఏర్పాటు అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. 'బియాండ్ హైదరాబాద్' ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాల్లో ఐటీ విస్తరణ ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా డేటాసెంటర్ల ఏర్పాటుకు కంపెనీలకు ఇన్సెంటివ్స్ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై కూడా సీఎం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలో7 నెట్-జీరో విధానాలు అమలు చేయాలని, ప్రపంచ స్థాయి ఏఐ సదుపాయాలతో 'ఏఐ సిటీ'ని అభివృద్ధి చేయాలని సూచిం చారు. ఐటీ , డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేందుకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్పీడ్ పెంచారు. ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ లో జరిగిన పరిశ్రమలు, ఐటీ శాఖల రివ్యూ మీటింగ్‌లో రాష్ట్రంలో డిజిటల్ నెట్‌వర్క్, ఐటీ రంగాన్ని ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించడంపై సీఎం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భవిష్యత్తు అవసరాలను ..మిగతా 2లో



# నిర్మలమ్మకు భట్టి రిక్వెస్ట్

### విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు ఇవ్వండి

### రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రితో భట్టి చర్చ

### ఎస్‌ఏఎస్‌సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి

### యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరణ

**హైదరాబాద్, మే 21 (ప్రభాత ఉదయం)**

దిల్లీలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు. ఆపై ఎస్‌ఏఎస్‌సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాష్ట్రంలోని విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులను వివరించిన భట్టి విక్రమార్క, మానవ వనరుల అభివృద్ధికి రాష్ట్రం చేపట్టిన కార్యక్రమాల వివరాలను తెలిపారు. యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరించిన డిప్యూటీ సీఎం, ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదిత ప్రాజెక్టులకు ఎఫ్ఆర్‌బీఎం పరిమితి మినహాయింపు కోరారు.

కేంద్రానికి కృతజ్ఞతలు : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన డిప్యూటీ సీఎం, తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సహాయం కోరారు. ఎస్‌ఏఎస్‌సీఐ కింద రూ.5,000 కోట్ల ప్రత్యేక సహాయం, విద్యారంగ పెట్టుబడులకు ..మిగతా 2లో

# ఘోర విషాదం

### కోనేరులో పడి ముగ్గురు చిన్నారులు మృతి



**జగిత్యాల మే 21 (ప్రభాత ఉదయం):**

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కొండపూర్ గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆటలాడుకుంటూ వెళ్లిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు కోనేరులో పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయవిదారక ఘటన మేడిపల్లి మండల పరిధిలోని కొండపూర్ గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఒకేసారి ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో గ్రామంలో ఒకేసారి తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. కొండపూర్ గ్రామానికి చెందిన మనవిత్ (10), మనస్విని (9), షర్విండ్ (7) అనే ముగ్గురు చిన్నారులు ఆడుకోవడానికి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో గ్రామంలోని కోనేరు సమీపంలోకి వెళ్లిన చిన్నారులు ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటి నుంచి బయటకు రాలేక ఊపిరాడక ముగ్గురూ నీటిలోనే ప్రాణాలు విడిచారు. ఘటనా స్థలానికి చేరుకున్న ..మిగతా 2లో

### తమిళనాడులో 59 ఏళ్ల తర్వాత

# మంత్రివర్గంలోకి కాంగ్రెస్


### తమిళనాడు సీఎం విజయ్ కేబినెట్ విస్తరణ

### మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్న ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

**తమిళనాడు మే 21 (ప్రభాత ఉదయం):**

తమిళనాడు రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ నిరీక్షణకు తెరపడనుంది. దాదాపు 59 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ తమిళనాడు ప్రభుత్వంలో భాగస్వామి కాబోతోంది. మంత్రివర్గ విస్తరణలో భాగంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు గురువారం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ అధికారికంగా వెల్లడించారు. కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత కే రాజేశ్ కుమార్, మరో ఎమ్మెల్యే పి విశ్వనాథన్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చెప్పారు. దశాబ్ద కాలానికి పైగా కాంగ్రెస్ డీఎంకేలో బలమైన మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ఎప్పుడూ ప్రభుత్వంలో భాగస్వామ్యం దక్కలేదు.

అయితే, ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా పగ్గాలు చేపట్టిన విజయ్ కాంగ్రెస్‌కు రెండు మంత్రి పదవులు ఇచ్చారు. దీంతో 1967 తర్వాత మళ్లీ కాంగ్రెస్ తమిళనాడు కేబినెట్‌లో అడుగుపెట్టబోతోంది. మేలూరు(మదురై) నియోజకవర్గం నుంచి గెలిచిన పి. విశ్వనాథన్, కన్యాకుమారి జిల్లాలోని కిల్లియూర్ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన అడ్వొకేట్ రాజేశ్ కుమార్‌కు మంత్రిపదవులు దక్కనున్నాయి. రాజేశ్ కుమార్ గత




కొంతకాలంగా కాంగ్రెస్‌కు అధికారంలో వాటా ఇవ్వాలని బహిరంగంగానే డిమాండ్ చేస్తూ వచ్చారు. గత ఏడాదే తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

**'ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తారని ఆశిస్తున్నా'**

మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వంలోకి రావడంపై వేణుగోపాల్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, "కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో రాజేశ్ కుమార్, పి. విశ్వనాథన్ గురువారం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తమిళనాడు ప్రజల ఆశయాలకు ..మిగతా 2లో



### ట్రంప్ అధికారాలకు

# సెనెట్ కళ్లెం

### యుద్ధ అధికారాలను పరిమితం చేస్తూ తీర్మానం

### బిల్లు ఆమోదానికి రిపబ్లిక్ అండ్ సభ్యుల మద్దతు

**వాషింగ్టన్ మే 21 (ప్రభాత ఉదయం):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ కళ్లెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ఇరాన్ పై యుద్దానికి దిగారు. యుద్ధంపై ట్రంప్ అధికారాలను పరిమితం చేసేందుకు డెమోక్రట్లు అనేకసార్లు సెనెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. అయితే, వారి తీర్మానాలకు తగినంత ఓటింగ్ లభించలేదు. డెమోక్రటిక సెనెటర్ టిమ్ కెయిన్ తాజాగా మరోసారి సెనెట్ ముందుకు తీర్మానాన్ని ..మిగతా 2లో

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# 'మెలోడి గిఫ్ట్' వీడియోకు గంటల్లోనే 100 మిలియన్ వ్యూస్

మొదటి పేజీ తరువాయి...

ఈ మెలోనీ రీల్ వైరల్ అయిన కొద్దిసేపటికే భారత స్టాక్‌మార్కెట్ ఇన్వెస్టర్లు కర్షీడా అనూహ్యంగా స్పందించారు. పార్లే సంస్థ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. స్టాక్ ఎక్స్ఛేంజీలో పార్లే ఇండస్ట్రీస్‌కు చెందిన 8 లక్షల షేర్లు చేతులు మారాయి.

**మెలోడి వైరల్- స్పందించిన పార్లేజి సంస్థ**

ఇక, మెలోడి చాక్లెట్ల విషయానికొస్తే, వాటిని పార్లే ప్రొడక్ట్స్ సంస్థ తయారుచేస్తోంది. పార్లే-జి, మాంగోబైట్, మొనాకో, హైడ్ అండ్ సీక్ ఈ సంస్థ బ్రాండ్లే. మరోవైపు, మెలోడీ చాక్లెట్లపై జార్జియా మెలోనీ వీడియో షేర్ చేయగానే పార్లే-జి సంస్థ స్పందించింది. '1983 నుంచి దేశాల మధ్య సంబంధాలను మధురంగా మారుస్తున్నాం' అనే క్యాప్షన్‌తో ఇన్‌స్టాలో ఆ వీడియోను షేర్ చేసింది. ముంబయి కేంద్రంగా ఈ కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అయితే, వీడియో వైరల్ అయిన కొద్దిసేపటికి పార్లే ప్రొడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మయాంక్ షా ఈ విషయంపై స్పందించారు. దేశీయ, అంతర్జాతీయ అమ్మకాల్లో కంపెనీ గణనీయమైన పురోగతిని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. "పార్లే మెలోడీని ప్రపంచ వేదికపైకి తీసుకువెళ్లినందుకు పార్లే ప్రొడక్ట్స్ ప్రధానమంత్రికి ధన్యవాదాలు తెలిపింది. భారతీయుల అభిమాన గీతం సరిహద్దులు దాటి పంచుకోవటాన్ని చూడటం పార్లే ప్రొడక్ట్స్‌లో మా అందరికీ గర్వకారణం" అని అని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

ఇక, ఈ రోజు మెలోడీ మూమెంట్ వైరల్ అయిన తర్వాత పార్లే పేరు విషయంలో మదుపర్లు ఒకింత గందరగోళానికి గురైనట్లు కనిపిస్తోంది. కొనుగోళ్ల మద్దతుతో నేటి ట్రేడింగ్‌లో పార్లే ఇండస్ట్రీస్ అప్పర్ సర్క్యూట్‌ను తాకినప్పటికీ, ఊగిసలాట కనిపించింది. ఈ స్టాక్ గతవారంలో 5.63శాతం, ఒక నెలలో 4 శాతం పెరిగింది. కానీ ఈ సంస్థ షేరు విలువ గత మూడు నెలల్లో 35 శాతం, ఈ ఏడాది ప్రారంభం నుంచి 41 శాతం మేర పతనమైంది. మెలోడీ మూమెంట్ వల్ల కాస్త జోరు కనిపించినా, మొత్తంగా ఈ షేర్లు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.ఇక, భారత్, ఇటలీ మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇరుదేశాలు అంగీకరించినట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇటలీ పర్యటనకు వెళ్లిన ప్రధాని ఇరుదేశాల సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనీతో చర్చలు జరిపారు. వాణిజ్యం, రక్షణ, క్లీన్ ఎనర్జీ, సాంకేతిక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. భారత్-ఇటలీ సంయుక్త ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. షిప్పింగ్, పోర్టుల ఆధునీకరణ, లాజిస్టిక్స్, బ్లూఎకానమీ రంగాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తాయన్నారు. భారత్-ఇటలీ మధ్య రక్షణ, పారిశ్రామిక రోడ్‌మ్యాప్ సైనిక హార్డ్‌వేర్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేయటానికి, ఉమ్మడి ఉత్పత్తికి మార్గం సుగమం చేసిందన్నారు. మెలోని నాయకత్వంలో ఇరుదేశాల సంబంధాలకు కొత్త శిఖరాలకు చేరుకున్నాయని ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు.

# అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్‌సిటీకి తీసుకురావాలి

మొదటి పేజీ తరువాయి...

దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఏకంగా 1500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఒక సరికొత్త 'డేటా సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం ప్రకటన చేశారు. ఈ ప్రతిష్టాత్మక డేటా సిటీ నిర్వహణకు భారీగా నీటి అవసరాలు ఉంటాయని, అందుకోసం ప్యూర్ వాటర్ కాకుండా ఎస్ టీ పీ ల ద్వారా రీసైకిల్ చేసిన నీటిని వినియోగించేలా ప్లాన్ చేయాలని అధికారులకు సీఎం సూచనలు ఇచ్చారు. అలాగే గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్, పెద్ద పెద్ద డేటా సెంటర్ల ఏర్పాటు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా ద్వితీయ శ్రేణి నగరాలలో కూడా ఈ జీసీసీల ఏర్పాటుపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టేలా సరికొత్త ఐటీ అండ్ ఇండస్ట్రియల్ పాలసీని తీసుకు రావాలన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా రాబోయే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట కోసం భూ సేకరణ పనులను తక్షణమే ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ నెట్‌వర్క్ ప్రాజెక్ట అయిన టీ-ఫైబర్ పై సీఎం రేవంత్ రెడ్డి డెడ్‌లైన్ విధించారు. రాబోయే మూడు నెలల్లోగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తప్పనిసరిగా నెట్‌వర్క్‌కు కనెక్ట్ కావాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ను కూడా మన ఫ్యూచర్ సిటీకే వచ్చేలా చూడాలని, అవసరమైతే దీని కోసం తాను స్వయంగా ప్రధాని మోడీని కలిసి రిక్వెస్ట్ చేస్తానని సీఎం అధికారులతో పేర్కొన్నారు. అలాగే హెల్త్ సిటీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్త్ సిటీ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వ సహకారం కోసం చర్చలు జరపాలని సీఎం సూచించారు. కంపెనీలు భూమి పూజలకు సిద్ధంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించే దిశగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కంపెనీలు ఎంఓయూలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు అందించే విధానాన్ని తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో అమలు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే వచ్చే మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని ఆదేశించారు. టీ-ఫైబర్ ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.54 కోట్లు విడుదలైనట్లు అధికారులు వెల్లడించారు.




బాబు రావు చేత కేక్ కట్ చేయిస్తున్న ఆత్మీయ పాత్రికేయ మిత్రులు, వారి కుటుంబ సభ్యులు

## ఘనంగా సాక్షి దినపత్రిక రిపోర్టర్ బుడిగెల బాబు రావు 50వ జన్మదిన వేడుకలు

**బుద్వేల్, మే 20 (ప్రభాత ఉదయం)**

సాక్షి దినపత్రిక రాజేంద్రనగర్ జోనల్ ఇంచార్జి, జర్నలిస్టు సంఘం నాయకులు, కిస్మత్ పూర్ వాస్తవ్యులు బుడిగెల బాబు రావు 50 జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. జన్మదిన వేడుకలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ పాల్గొని బాబు రావు ను సన్మానించారు. బాబు రావు కు దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు. కార్యక్రమంలో బాబు రావు సతీమణి రంజిత బాబు రావు, భవిత్, శ్రీ చైత్ర, బాబు రావు సోదరులు భీమేష్ రావు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బుడిగెల బాబు రావు కు బీజేపీ రాష్ట్ర నాయకులు అన్నపురెడ్డి భీమార్జున్ రెడ్డి, బడ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ బుర్ర మహేందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ లు సాగర్ గౌడ్, గొకరి సురేష్ గౌడ్, పాత బస్తీకి చెందిన కప్ప కృష్ణ గౌడ్, కె,వెంకటేష్, కాశమోని శ్యామ్ రావు ముదిరాజ్, పి రాధాకృష్ణ, , రాజేంద్రనగర్ , అత్తాపూర్ సర్కిళ్ల నాయకులు పి జయప్రకాష్, వనం నరసింహ మాదిగ, ఎం రాజు, రగడం పల్లి శ్రావణ్, పెండ్యాల సాయి మల్లిక్, కోరని రవీందర్, రాజు గౌడ్, జర్నలిస్టులు ఎం బాలసుబ్రమణ్యం, రాజేందర్ రెడ్డి, గోపాల్, శివ, భానుప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.



బాబు రావు ను సన్మానిస్తున్న కాశమోని శ్యామ్ రావు ముదిరాజ్

**కుటుంబ సభ్యుల తో జన్మదిన వేడుకలలో పాల్గొన్న ఆత్మీయ పాత్రికేయ మిత్రులు**


సీనియర్ రిపోర్టర్ బుడిగెల బాబు రావు జన్మదిన వేడుకలలో ఆత్మీయ పాత్రికేయ మిత్రులు వారి కుటుంబ సభ్యుల తో పాల్గొన్నారు. బాబురావు ను సన్మానించి కేక్ కట్ చేయించారు. ఈ వేడుకలలో పాత్రికేయులు మేకల దామోదర్ రెడ్డి, వనితా దామోదర్ రెడ్డి, అప్పారెడ్డి గూడెం భీమయ్య, మాధవి భీమయ్య, మెక్కొండ ప్రేమ్ రాజ్, సుభద్ర ప్రేమ్ రాజ్, వర్కాల చందు, రాధిక చందు, గద్దె యాదగిరి, కోరని మహేష్, శశాంక్ అప్పారెడ్డిగూడెం, శ్రేయాన్, ఆర్థిక్ లు పాల్గొన్నారు.




బాబు రావు ను సన్మానిస్తున్న ఎ భీమార్జున్ రెడ్డి, తదితరులు




శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు కప్పే కృష్ణా గౌడ్



డాక్టర్ వి ప్రవీణ్ రావు

## గుర్తు చేసుకుంటున్నారు..

**బుద్వేల్, మే 20 (ప్రభాత ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రెండు పర్యాయాలు వైస్ ఛాన్సలర్ గా కొనసాగిన డాక్టర్ వి ప్రవీణ్ రావు ను వర్సిటీలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులు గుర్తు చేసుకుంటున్నారు. పని చేయించుకోవడంలో కొంచెం నిక్కచ్చిగా ఉన్నప్పటికీ మంచి మనసున్న అధికారిగా ఆయన ఉన్నారని చెప్పుకుంటున్నారు. ఆయనే... నయం ...అని అనుకుంటున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పేరు ప్రఖ్యాతులను దేశవ్యాప్తంగా విస్తరింప చేయడంలో డాక్టర్ వెలిచాల ప్రవీణ్ రావు ఎంతగానో కృషి చేశారని చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం కావేరి విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్ గా పనిచేస్తున్న డాక్టర్ ప్రవీణ్ రావు ఆ విశ్వవిద్యాలయాన్ని కూడా ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతారని గుర్తు చేసుకుంటున్నారు.

**నేడు జన్మదిన వేడుకలు జరుపుకోనున్న రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ గారికి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు.**

**ఇట్లు**
**అప్పారెడ్డి గూడెం భీమయ్య (డానియల్),**
**కుటుంబ సభ్యులు.**



రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్

# నిర్మలమ్మకు భట్టి రిక్వెస్ట్

మొదటి పేజీ తరువాయి...

ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. సాస్కీ కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రాలకు 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల రూపంలో అందిస్తున్న సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు : 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని కేంద్ర మంత్రికి వివరించారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాల్లో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అయినప్పటికీ 2014 నుంచి 2023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థలు (ఎస్‌వీపీ) ద్వారా తీసుకున్న అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు : అయినా విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని ప్రస్తావించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు నిర్మలా సీతారామన్‌కి తెలిపారు. జిల్లాల వారీగా కొత్త మెడికల్ కళాశాలలు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా మౌలిక వసతుల బలోపేతం వంటి కార్యక్రమాలు సామాజిక సమానత్వంతో కూడిన సుస్థిర అభివృద్ధికి దోహదపడతాయని కేంద్రమంత్రికి వివరించారు.

విద్యారంగ రూపాంతరానికి రూ.30,000 కోట్లు : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ రూపాంతరానికి మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించిందని ప్రస్తావించారు. ఇందులో రూ.21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ క్యాంపస్‌ల నిర్మాణం, మరో రూ.9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి : కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. బొగ్గు గ్యాసిఫికేషన్ దిశగా సింగరేణి ముందడుగుకు కేంద్ర సహకారం కోరారు. కోల్ ఇండియా తరహాలో గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి చూపుతోందని తెలిపారు. గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి చూపుతోందని కిషన్‌రెడ్డికి భట్టి తెలిపారు. కొయ్యగూడెం బ్లాక్-3 కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్-2 మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు.

# ఘోర విషాదం

పోలీసులు.. చిన్నారులు కోనేరులో పడిపోయిన విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆ వెంటనే మేడిపల్లి పోలీసులు హుటాహుటిన స్పాట్‌కు చేరుకున్నారు. స్థానికుల సాయంతో కోనేరులో గాలించి చిన్నారుల మృతదేహాలను వెలికితీశారు. ముక్కుపచ్చలారని చిన్నారుల శవాలను చూసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అయితే, ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది

# తమిళనాడులో 59 ఏళ్ల తర్వాత మంత్రివర్గంలోకి కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి...

అనుగుణంగా వారు పనిచేస్తారని విశ్వసిస్తున్నాం. రాహుల్ గాంధీ ప్రతిపాదించిన ప్రజాహిత పరిపాలన లక్ష్యాలను వారు ముందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నా" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, టీవీకే సీనియర్ నేత, పబ్లిక్ వర్క్స్, క్రీడాశాఖ మంత్రి ఆధవ్ అర్జున కాంగ్రెస్, వీసీకే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) పార్టీలను ప్రభుత్వంలో చేరాలని కోరారు. ఇది ముఖ్యమంత్రి విజయ్ ఆకాంక్ష అని ఆయన పేర్కొన్నారు.

**ప్రభుత్వంలో భాగస్వామ్యం కాని కాంగ్రెస్**

ఇక, తమిళనాడు రాజకీయాల్లో ఈ పరిణామానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే, 1967లో డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం కాలేదు. 1952 నుంచి 1967 వరకు అప్పటి మద్రాస్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగింది. సి. రాజగోపాలాచారి, కె. కామరాజ్, ఎం. భక్తవత్సలం ముఖ్యమంత్రులుగా పనిచేశారు. అయితే, 1967లో డీఎంకే ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో ద్రావిడ పార్టీల ఆధిపత్యం కొనసాగింది. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ డీఎంకే, ఏఐఏడీఎంకేతో పొత్తులు పెట్టుకున్నప్పటికీ ప్రభుత్వంలో మాత్రం భాగస్వామ్యం కాలేదు. ప్రత్యేకంగా 2006-11 మధ్య డీఎంకే ప్రభుత్వంలో కాంగ్రెస్ అధికార భాగస్వామ్యం కోరినా ఫలితం లేకపోయింది.

# ట్రంప్ అధికారాలకు సెనెట్ కళ్లెం

మొదటి పేజీ తరువాయి...

ప్రవేశపెట్టారు. యుద్ధ ప్రకటన, సైనిక చర్యకు కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లభిస్తే తప్ప, ఇరాన్ లోపల లేదా దానికి వ్యతిరేకంగా జరిగే ఘర్షణల్లో యూఎస్ దళాలు పాల్గొనకూడదని అందులో తెలిపారు. దీనికి 50 మంది అనుకూలంగా.. 47 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఈ తీర్మానం ఆమోదంలో నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. కాగా ఈ బిల్లు ఆమోదానికి సంబంధించి త్వరలో తుది ఓటింగ్ జరగనుంది. ఇది చట్టంగా మారితే కాంగ్రెస్ అధికారికంగా సైనిక దాడి కొనసాగించడానికి అనుమతి ఇచ్చేవరకు ట్రంప్ ఇరాన్‌పై ఎలాంటి దాడులకు దిగకూడదు. ఓటింగ్ సందర్భంగా డెమోక్రటిక సెనెట్ చక షుమర్ మాట్లాడుతూ యుద్ధానికి సంబంధించిన నిర్ణయాలపై కాంగ్రెస్ తిరిగి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. 'ఈ అధ్యక్షుడు నిండుగా తూటాలున్న తుపాకీతో ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా ఉన్నాడని వ్యాఖ్యానిం చారు. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## మహిళా కమిషన్ సభ్యురాలు గా నేడు ప్రమాణం చేయనున్న కుమారి అబ్దేశి సదాలక్ష్మి

**బుద్వేల్, మే 20 (ప్రభాత ఉదయం)**



తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గా నియమితులైన పీసీసీ ప్రధాన కార్యదర్శి కుమారి అబ్దేశి సదాలక్ష్మి గురువారం బుద్ధ భవన్ లోని కమిషన్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తనకు ఈ పదవి ని ఇచ్చిన ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి కి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. సహకారం అందచేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, దనసరి అనసూయ సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

# ఆవులను అక్రమ రవాణా చేసే వారిని శిక్షించాలి

**బిజెపి యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్**

కూకట్ పల్లి, మే 20 (ప్రభాత ఉదయం) హిందువుల ఆరాధ్య దైవమైన గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గో రక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా బిజెపి యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ ను వారి నివాసం దగ్గర జగద్గిరిగుట్ట పోలీస్ లు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆవుల అక్రమ రవాణా చేసేవారిని శిక్షించాలి అన్నారు. శనివారం మే 16 రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. హిందువైనా, ఎంఐఎం నాయకులైనా చట్టం ఒకే విధంగా ఉండాలని అన్నారు .గోవుల అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని అన్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వం అక్రమ రవాణాను ఎందుకు ఆపడం లేదని హిందువుల తరుపున ప్రశ్నిస్తున్నాఅన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హిందువుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత గల రాష్ట్ర ప్రభుత్వం ఒకే వర్గానికి కొమ్ముకాస్తూ వారి ఆగడాలను సమర్థించడం సరైనది కాదన్నారు.



# పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**



పరమారెడ్డి హిల్స్‌లోని పార్కును పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ బృందం

బుద్వేల్ , మే 20 (ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలో గల పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ పరిధిలో ని జనచైతన్య ఫేస్ 1 , ఫేస్ 2 లతో పాటు పరమా రెడ్డి హిల్స్, సిరిమల్లె కాలనీ ప్రాంతాలలో గల పార్కులను బుధవారం జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు . ఇప్పటికే అభివృద్ధిలో ఉన్న మూడు పార్కుల లో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు

ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణయాన్ని అందించడానికి, చిన్నారులు ఆడుకోవడానికి, పాద చారులు మార్నింగ్ వాక్ చేయడానికి అనుకూలంగా పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్కుల, కాలనీల పరిసరాలు ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉండగలుగుతారని సూచించారు. పార్కుల పరిశీలన లో జోనల్ కమిషనర్ తో పాటు ఇంచార్జ్ ఎస్ ఈ నరేందర్ గౌడ్, అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు మల్లారెడ్డి, బి సురేందర్ రెడ్డి, అర్బన్ బయో డైవర్సిటి విభాగం డిప్యూటీ డైరెక్టర్ విష్ణు వర్ధన్, మేనేజర్ లు అశోక్, తదితరులు పాల్గొన్నారు.



జన చైతన్య కాలనీ లోని పార్కును పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**జిల్లా వైద్యాధికారి డాక్టర్ స్వర్ణకుమారి**

రాజేంద్రనగర్,మే20 (ప్రభాతఉదయం)ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడ కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ స్వర్ణకుమారి సూచించారు.అత్తాపూర్ సర్కిల్ శివరాం పల్లిలోని వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ రాబోయే రోజులలో ఎండల తీవ్రత అధికంగా ఉ ంటుందని ఉదయం 10గంటల్లోపు, సాయంత్రం 4గంటల తర్వాతే పనులు చేసుకోవాలని సూచించారు. వడదెబ్బ తగల కుండా అధికంగా ద్రవ పదార్థాలు సేవించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. సాధారణ ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేలా ప్రోత్స హించాలన్నారు. ప్రతి ఒక్కరు వడగాలులు, ఎండ వేడిమి నుండి రక్షించుకోవడం కోసం తగు జాగ్రత్తలు పాటిస్తూ తమను తాము రక్షించుకోవడం అత్యంత అవసరమని పిలుపునిచ్చారు.

**వేసవికాలం వడదెబ్బ నుండి రక్షించుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలి..**

ప్రతిరోజు క్రమం తప్పకుండా ఎక్కువ నీరు తాగాలి. రోజుకు కనీసం నాలుగు నుంచి ఐదు లీటర్ల నీరు తాగాలి. నీరు,పళ్ళ రసాలు,కొబ్బరి నీళ్లు,మజ్జిగ, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి



లేత వర్ణము తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి..

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి,శుభ్రంగా రెండు పూటలా స్నానం చేయాలి,మితంగా భోజనం చేయాలి,ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచాలి,

ఫ్యాన్ వేసి గదిని చల్లగా ఉంచుకోవాలి,

బయట తిరిగి వచ్చిన వెంటనే కొద్దిసేపు నీడలో కూర్చోవాలి.దీంతో శరీరం చల్లబడడంతో పాటు శరీరంలోని అవయవాలు కూడా చల్లబడుతాయి. ఎండలో తిరిగిన వారు కనీసం ఐదు నుంచి పది నిమిషాల పాటు నీడలో సేద తీరిన తర్వాత స్వచ్ఛమైన నీరు తాగాలి.బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి..సూర్య రష్మి ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగకపోవడం మంచిది.

ఒకవేళ వెళ్లాల్సి వస్తే టోపీ,స్కార్ఫ్ వంటివి వాడాలి. వదులైన కాటన్ దుస్తులు ధరించాలి.బయటకు వెళ్లినప్పుడు వెంట త్రాగునీటి వాటర్ బాటిల్ తీసుకొని వెళ్ళాలి.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ వేడిమి ఎక్కువగా ఉంటుంది కాబట్టి బయటకు వెళ్లకపోవడమే మంచిది.

రోడ్లమీద లభించే చల్లని రంగు పానీయాలు తాగరాదు..

మాంసాహారం తగ్గించాలి మద్యం సేవించరాదు, నలుపు దుస్తులు,మందంగా ఉన్న దుస్తులు ధరించరాదు. వడదెబ్బకు గురి అయిన వ్యక్తికి చేయాల్సిన ప్రథమ చికిత్సలు,వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ గల ప్రదేశానికి చేర్చాలి,

చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం తుడవాలి.శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేవరకు తుడుస్తూ ఉండాలి,ఫ్యాను గాలి లేదా చల్లని గాలి తగిలేలా ఉ ంచాలి,ఉప్పు కలిపిన మజ్జిగ కానీ లేదా ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణం కానీ త్రాగించాలి.వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు త్రాగించకూడదు.వీలైనంత త్వరగా దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.



# తెలంగాణ రాజకీయాల్లో మహిళా సాధికారతకు మరో ముందడుగు

**కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరం ప్రారంభం**

**ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు**

కూకట్ పల్లి, మే 20 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు కుమారస్వామి ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి ఉచిత శిక్షణా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో మహిళలు కేవలం కుటుంబ బాధ్యతలకే పరిమితం కాకుండా నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న “సమర్థ్” వంటి పథకాల ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తూ ఉపాధి అవకాశాలను పెంచుతున్నదని తెలిపారు. ముఖ్యంగా కుట్టు మిషన్ శిక్షణ ద్వారా మహిళలు ఇంటి వద్ద నుంచే ఉపాధి పొందే అవకాశం కలుగుతుందని, కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవచ్చని అన్నారు. అనంతరం శిబిరంలో శిక్షణ పొందిన మహిళలు తయారు చేసిన వివిధ రకాల దుస్తులను పరిశీలించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు వారి ప్రతిభను, సృజనాత్మకతను ప్రత్యేకంగా అభినందించారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేసి వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందేలా ప్రోత్సహించారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబానికి అండగా నిలిచి సమాజంలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. సమాజ సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ట్రస్ట్ సభ్యుల సేవలను కూడా ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, మహిళలు, స్థానిక ప్రముఖులు, డివిజన్ బీజేపీ నాయకులు రఘురాం, వినోద్ గౌడ్, సూరిబాబు, ప్రేమ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సెప్టిక్ ట్యాంక్‌లో పడి ఓ వ్యక్తి మృతి

బుద్వేల్ , మే 20 (ప్రభాత ఉదయం) : పాత కర్నూల్ రోడ్డు లో నిర్మాణంలో ఉన్న ఎవలోన్ అన్మోల్ అపార్ట్మెంట్స్ కన్స్ట్రక్షన్ బిల్డింగ్ పక్కన ఉన్న ఓపెన్ సెప్టిక్ ట్యాంక్ లో మరణించి పడి ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని బుధవారం మైలార్దేవుపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జయలక్ష్మి తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... ఎవలోన్ అన్మోల్ అపార్ట్మెంట్స్ పక్కన ఉన్న మరుగుదొడ్ల వద్ద దుర్వాసన వస్తుండటంతో కార్మికులు వెళ్లి చూడగా, ఓపెన్ సెప్టిక్ ట్యాంక్ లో ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని టోలిచౌకి కి చెందిన సివిల్ ఇంజనీర్ మహ్మద్ అథిక్ పాషా బుధవారం మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ జయలక్ష్మి సం ఘటన స్థలానికి వెళ్లి చూడగా, సెప్టిక్ ట్యాంక్ లో బోర్లా పడి ఉన్న మృతదేహం కనిపించింది. దానిని బయటకు తీయగా, మృతుని ఎడమ చేతిపై అమ్మా దేవా అని, కుడి చేతిపై ఆర్ఆర్ఆర్, ఎం రాము అని, ఛాతిపై దేవా అని పచ్చ బొట్లు ఉన్నాయి. నలుపు రంగు పాయింట్. నలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నాడు. ఎత్తు 5.6 అడుగులు, హింధువు అని, 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. అతనికి సంబందించిన వారు ఎవరైన ఉంటే మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ సెల్ 8712680419, ఎస్ఐ జయలక్ష్మి 8712554096 నెంబర్లకు కాల్ చేసి చెప్పవచ్చన్నారు.

# ఫోటోగ్రఫీ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(ప్రభాత ఉదయం) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న యూత్ వీక్ సెలబ్రేషన్లో ఫోటోగ్రఫీ పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు తాము తీసిన ఫోటోలను ఈనెల 22వ తేదీలోగా డిపిఆర్ఓ మెయిల్ ఐడి dpro.jogulamba. tg@gmail.com కు పంపవలసిందిగా తెలిపారు. ఉత్తమ ఫోటోలను ఎంపిక చేసి గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ. 5000, రూ.3000, రూ.2000 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు తాము తీసిన ఫోటోలను, తమ వివరాలను ఈనెల 22వ తేదీలోగా సంబంధిత మెయిల్ ఐడికి పంపాలన్నారు. ఉ త్తమ ఫోటోలను ఎంపిక చేసి ఈనెల 23న బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

# కాగితాల్లో నిబంధనలు.. రోడ్డుపై అక్రమాలు



**నెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు**

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(ప్రభాత ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సెట్ బ్యాక్ లేకుండా విచ్చలవిడిగా నిర్మాణాలు చేపడుతున్నారు. పలు చోట్ల వదిలినా రోడ్డు వరకూ ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. దీంతో 30 అడుగుల వెడల్పు ఉండాల్సిన రహదారులు కుచించుకుపోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పార్కింగ్ లేకుండా బహుళ అంతస్తుల భవనాలకు అనుమతించడం, పార్కింగ్ కోసం నిర్మించిన సెల్లార్‌లు వ్యాపార దుకాణాలుగా మారిపోవడంతో వాహనాలు నిలిపేందుకు స్థలం లేకుండా పోతోంది. గద్వాల మున్సిపాలిటి పరిధిలో భీంనగర్, రాజవీధి,రాజీవ్ మార్గ్, నల్లకుంట, హాస్పిటల్ లేన్, తదితర ప్రధాన మార్గాలలో ఫుట్‌పాత్ వ్యాపారులకు ఇవ్వడంతో పార్కింగ్ లేకుండా పోతోంది. గతంలో గుర్తించిన పార్కింగ్ స్థలం కూడా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో అన్యాక్రాంతమైంది. ఈ ప్రాంతంలో ప్రతీ వ్యాపారి రోడ్డుపైకే వచ్చి వ్యాపారులు చేయడంతో రహదారి ఇరుకుగా మారిపోతుంది.

కాలనీల్లో తప్పని కష్టాలు

ప్రధాన వీధులే కాకుండా కాలనీల్లోని రోడ్ల ఆక్రమణ యథేచ్ఛగా కొనసాగుతోంది. అభివృద్ధిలో దూసుకెళ్తున్న గద్వాలలో ప్రతీ వీధిలో రోడ్ల ఆక్రమణ సాధారణమైపోయింది. ఇంటి నిర్మాణం వెనక్కి జరిగి చేపట్టినప్పటికీ సెట్‌బ్యాక్‌కు వదిలిన స్థలంలో ర్యాంపులు, పూల మొక్కల కోసం పిట్టగోడలను పెట్టి ఆక్రమణలు చేపట్టారు. దీంతో వీధుల్లో ఒక వాహనం ఎదురొస్తే మరో వాహనం నిలిచిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణంలో ఏ వీధిలోనూ 30 అడుగుల రోడ్లు కనిపించడం లేదు. పెరుగుతున్న అవసరాలకు ఈ రోడ్లు మరింత ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

# తమ స్వంత మనిషిని కారులో ఎక్కించి తీసుకువెళితే.. కిడ్నాప్ అంటు కలకలం

బుద్వేల్, మే 20 (ప్రభాత ఉదయం) : మంగళవారం అర్ధరాత్రి ఓ యువతిని హైదర[illegible]ీడ చౌరస్తా సమీపంలో నలుగురు యువకులు థార్ కారులో బలవంతంగా ఎక్కించుకుని వెళుతున్నారని 100కు డయల్ చేసి పోలీసులకు చెప్పడంతో ఈ సంఘటన పై పోలీసులు అలర్ట్ అయ్యారు. రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ పర్యవేక్షణలో నాలుగు టీమ్లలను ఏర్పాటు చేసి కిడ్నాప్ కు గురైన యువతి తో పాటు కిడ్నాప్ కు పాల్పడిన వారి వివరాలు సేకరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. యువతి థార్ కారు లో ఎక్క కుండ హైదర[illegible]ీడ వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రి లోపలికి వెశగా అక్కడినుంచి కూడా ఆమెను తీసుకువెళ్లారని తెలుస్తోంది. పోలీసులకు సమాచారం అందిన తర్వాత వారు ఆరాంఘర్ చౌరస్తా వరకు వెతికిన ఫలితం కనిపించలేదు. థార్ కారు వెనుకాల ఓ ద్విచక్ర వాహనంను నడుపుతున్న వ్యక్తి వెళ్లాడని, ద్విచక్ర వాహనదారుడు ఆ కారు తాలుకా మనిషి అని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటన పై పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు.

**తమకు తెలిసిన మహిళనే థార్ వాహనంలో తీసుకువెళ్లారా ?**

మహిళ ను బలవంతంగా కారులోకి మలక్పేట్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ తమ కుటుంబ సభ్యులతో గొడవ పడినట్లు తెలుస్తుంది. ఆమెను టాక్సీ కారులో ఇంటికి పంపించగా, ఆమె హైదర్గాగూడ 144 వద్ద గల జాయ్ ఆసుపత్రి వద్ద దిగిపోయారని తెలుస్తుంది. అది గమనించిన ఆ మహిళ బంధువులు ఆమెను స్వంత కారులో వెంబడిం చగా, ఆమె వారితో వెళ్లడానికి ఒప్పుకోలేదని తెలిసింది. దీంతో ఆ × ఎక్కించుకుని తీసుకువెళ్లినట్లు సమాచారం. అయితే అంతకు ముందే ఆ మహిళ హైదర్ గూడ రత్నదీప్ లో కొన్ని వస్తువులు తీసుకుని ఫోన్ పే ద్వారా చెల్లించినట్లు తెలిసింది. దీనిపై రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ పర్యవేక్షణలో అత్తాపూర్ ఇన్పెక్టర్ నాగేశ్వర్ రావు నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చూపట్టినట్లు పోలీసులు తెలిపారు. దార్ కారులో తీసుకువెళ్లిన ఆ మహిళ కారులో ఉన్న వారి కి తెలిసిన వారేనని పోలీసులు అనుమానిస్తున్నారు. మలక్పేట్ లో ఆ మహిళ ఆచూకి తెలిసినట్లు, ఆమె క్షేమంగా ఉన్నట్లు సమాచారం. అయితే కేసు దర్యాప్తు లో ఉందని డీసీపీ ఎస్ శ్రీనివాస్ తెలిపారు.

# గోరక్ష కార్యకర్తల అక్రమ అరెస్టులు... ప్రజాస్వామ్య హక్కుల అణచివేతపై ఆగ్రహం

కూకట్ పల్లి, మే 20 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం, బబ్బుగూడ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ గోవుల తరలింపులు, గోవధం, అక్రమ క్రయవిక్రయాలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న “చలో బబ్బుగూడ” కార్యక్రమానికి పిలుపునిచ్చిన గోరక్ష కార్యకర్తలను పోలీసులు తెల్లవారుజామునే అదుపులోకి తీసుకోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బుధవారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో కార్యకర్తలను వారి ఇళ్ల వద్ద నుంచే పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి, ముందుగా సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అక్కడి నుండి కుల్సుంపుర పోలీస్ స్టేషన్‌కు మార్చినట్లు సమాచారం. అరెస్టు అయిన వారిలో కంచి మహేందర్, కృష్ణా గౌడ్, భార్గవ్ గౌడ్, హరి ప్రసాద్, విజయ్, గోగికర్ రోహిత్ ఉన్నారు. ఈ సందర్భంగా గోరక్ష కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేయడానికి వచ్చిన గోభక్తుల గొంతును ప్రభుత్వం, పోలీసులు అణిచివేయాలని ప్రయత్నించడం ఖండనీయమని పేర్కొన్నారు. గోవుల రక్షణ కోసం పోరాడుతున్న వారిపై ఈ విధమైన అక్రమ అరెస్టులు చేయడం అన్యాయమని, గోమాత సంరక్షణ కోసం తమ ఉద్యమం మరింత ఉధృతంగా కొనసాగుతుందని కార్యకర్తలు స్పష్టం చేశారు.“గోమాత రక్షణ కోసం మా పోరాటం ఆగదు... కొనసాగుతుంది”






# మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతాలలో ఉచిత వైద్య సేవలను అందిస్తాం

**యువతలో హార్ట్ స్ట్రోక్, బ్రెయిన్ స్ట్రోక్ ఎక్కువగా వస్తున్నాయి**

**టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ ఉదయ్ గౌతమ్**

కూకట్ పల్లి, మే 20 (ప్రభాత ఉదయం) కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్ స్టాప్ వద్ద టీపీసీసీ డాక్టర్స్ సెల్, సరళ దేవి ఫౌండేషన్, గౌతమ్ న్యూరో కేర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులతో పాటు ప్రత్యేక న్యూరోకేర్ కన్సల్టెంట్ సేవలను కూడా అందించారు. మధ్యతరగతి కుటుంబాలు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు, మందులు అందించడం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల పేద, మధ్యతరగతి కాలనీల వరకు ఈ కార్యక్రమాలను విస్తరిస్తున్నామని టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ ఉదయ్ గౌతమ్ పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి తర్వాత రక్తనాళాల్లో బ్లడ్ క్లాట్స్ సమస్యలు పెరిగాయని, యువతలో హార్ట్ స్ట్రోక్, బ్రెయిన్ స్ట్రోక్ కేసులు అధికమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు మెడికల్ స్టూడెంట్స్, డాక్టర్లు కలిసి అవసరమైన జాగ్రత్తలు, మందుల వినియోగంపై సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రక్త పరీక్షలు, నరాల పరీక్షలు, బాడీ కంపోసిషన్ అనాలిసిస్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.

# ఫర్మిట్ రూమ్‌ల చాటున జోరుగా మద్యం విక్రయాలు



గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(ప్రభాత ఉదయం):

గద్వాల జిల్లా కేంద్రంలోని పలు మద్యం దుకాణల వద్ద తెల్లవారకముందే మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా ఎక్సైజ్ శాఖ కూత వేటు దూరంలో ఉన్న మద్యం దుకాణాల వద్ద మద్యం విక్రయిస్తున్న ఎక్సైజ్ అధికారులకు దృష్టి సారించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. జిల్లా కేంద్రంలో పాత కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న ఓ మద్యంషాపు అలాగే మేలచెర్వు చౌరస్తా లో ఉన్న ఓ మద్యం షాపు వద్ద నిబంధనల విరుద్దంగా ఫర్మిట్‌రూం ల్లో తెల్లవారుజామున నుంచే మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారు. పర్మిట్ రూమ్ ల చాటున నిర్వాహకులు బహిరంగానే మద్యం విక్రయాలు పాల్పడుతున్న ఎజ్సైజ్ అధికారులు ఎవరూ అట్టు వైపు తనిఖీలు చేసిన పాపాన పోలేదన్నా విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్దంగా ఫర్మిట్ రూం ల వద్ద మద్యం విక్రయాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు.




# సీఎం రిలీఫ్ ఫండ్‌లు పేదలకు వరం..

## రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్



రాజేంద్రనగర్,మే20(ప్రభాత ఉదయం)సీఎం రిలీఫ్ ఫండ్ లు పేదలకు వరమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.జీహెచ్ఎంసీ 122 డివిజన్ కు చెందిన దుడ్డు కిరణ్ కు రూ.60 వేలు ఇందిరమ్మ కాలనీకి చెందిన మాన్యనాయక్ కు రూ.60 వేలు,లక్ష్మణ్ నాయక్ రూ.29వేల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేలా చొరవ చూపడం జరుగుతుందన్నారు.ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించేందుకు అన్నివిధాలా కృషి చేస్తున్నట్లువెల్లడించారు.ఈ మేరకు స్థానిక నాయకులు,కార్యకర్తలకు పలు సూచనలు చేసినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్ గౌడ్,నాయకులు గోకరి సురేష్ గౌడ్,చేగూరి రాజు,గోపాల్ నాయక్,గోపాల్,స్వామి నాయక్,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు మహిళా కమిషన్ సభ్యురాలుగా ప్రమాణం



సదాలక్ష్మి ని సన్మానిస్తున్న విద్యార్థినిలు



2000 సంవత్సరంలో మహిళా సంఘాల ఏర్పాటు శిక్షణ కార్యక్రమం లో పాల్గొన్న సదాలక్ష్మి

రాజేంద్రనగర్, మే 20 (ప్రభాత ఉదయం) : 30 సంవత్సరాలుగా సామాజిక, రాజకీయ రంగాలలో తాను చేసిన సేవలకు నేడు ఫలితం దక్కిందని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమితులైన ఎ సదాలక్ష్మి అన్నారు. మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమితులైన ఎ సదాలక్ష్మీ ని బుధవారం పలువురు విద్యార్థినీలు, ఉద్యోగులు, జర్నలిస్టులు రాజేంద్రనగర్ లో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎ సదాలక్ష్మీ మాట్లాడుతూ, 1997 ఫిబ్రవరి 23న శ్రామిక విద్యాపీఠ్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా




గాంధీ భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో... సదాలక్ష్మి

దినోత్సవం సందర్భంగా తానే మాట్లాడిన తీరుకు మెచ్చి శ్రామిక విధ్యాపీఠ్ కు డైరెక్టర్ గా ఉన్న ఉషారాణి సహకారంతో సామాజిక చైతన్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానన్నారు. 1997 ఏప్రిల్ 22న రాజేంద్రనగర్ మునిసిపాలిటీ లో 100 మహిళా సంఘాలను ఏర్పాటు చేయడం లో కీలకపాత్ర పోషించడం జరిగిందన్నారు. 100 మహిళా సంఘాల ఏర్పాటు సందర్భంగా అదే సంవత్సరం నవంబరు లో అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సతీష్ చంద్ర, ఉషారాణి నేతృత్వంలో పెద్ద సభ ఏర్పాటు చేసి అభినందించారన్నారు. 2000 సంవత్సరంలో గోల్ రీవైవల్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్ (గ్రేస్) అనే స్వచ్ఛంద సంస్థ ను స్థాపించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం, వృద్ధుల సంక్షేమం కోసం, మహిళా సంఘాల ఏర్పాటు కోసం, విద్యావ్యాప్తి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు

కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ (సీడీఎస్) కు అదే సంవత్సరం లో రాజేంద్రనగర్ మునిసిపాలిటీ లో చైర్మన్ గా ఎన్నుకోబడి రూ.3 కోట్లతో రాజేంద్రనగర్ మునిసిపాలిటీ లో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. 2002 లో నగరంలోని 9 మునిసిపాలిటీలలో సెంటర్ ఫర్ అర్బన్ ఎన్విరాన్మెంట్ రీసోర్స్ స్కీమ్ కు ప్రతినిధిగా ఎంపిక కావడం జరిగిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ లో అకాడమిక్ కౌన్సిలర్ గా పనిచేయడం జరిగిందన్నారు. జన్మభూమి కార్యక్రమాలలో పాల్గొన్నందుకు బెస్ట్ యూత్ అవార్డును గెలుపొందడం జరిగిందని సదాలక్ష్మీ తెలిపారు. 2014 లో దళిత యువ రత్న అవార్డు, 2018 లో ఏపీజే అబ్దుల్ కలామ్ ఎక్సెలెన్సీ అవార్డులను అందుకోవడం జరిగిందన్నారు. 2009 లో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. అప్పటి నుంచి పార్టీలో మహిళా కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలుగా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేయడం జరిగిందన్నారు. తన పనితీరు ను మెచ్చి ముఖ్యమంత్రి మహిళా కమిషన్ సభ్యురాలుగా ఇచ్చారన్నారు. ఈ నెల 21న ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. తనకు సహకరించిన ముఖ్యమంత్రి తో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి బట్టి మల్లు విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ్మా, సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి లకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.



2009 లో రాజీవ్ నగర బాట సందర్భంగా శివరాంపల్లి కి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సదాలక్ష్మి నిర్వహిస్తున్న ఎన్ సీ ఎల్ పీ ప్రాజెక్ట్ ను చూసి అభినందిస్తున్న దృశ్యం

# ప్రతి సమస్యను పరిష్కరిస్తాం అభివృద్ధిలో ప్రతీకగా తీర్చిదిద్దుతాం

**బీరంగూడ, అమీన్పూర్ డివిజన్ల లో సుడిగాలి పర్యటన**

**త్వరలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



పటాన్ చెరు, మే 20 (ప్రభాత ఉదయం): అమీన్పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం అమీన్పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని తులసివనం కాలనీ, భ్రమరాంబిక నగర్ కాలనీ, ఏ ఆర్ బృందావన్ కాలనీ, కె ఎస్ ఆర్ కాలనీ, అంజనాద్రి కాలనీ, టైలర్ కాలనీ, ఎన్ ఎస్ ఎల్ కాలనీ, ఎన్ బి ఆర్ కాలనీ, ఇక్రిశాట్ కాలనీలలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటించారు. నేరుగా ప్రజలు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, యూజిడీలు, విద్యుత్, తాగు నీరు తదితర అంశాలపై చర్చించారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను నివేదిక రూపంలో తనకు అందించాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయించి నిర్దేశించిన గడువుగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు.

అమీన్పూర్ పరిధిలో దశాబ్దాల కాలంగా అపరిస్కృతంగా ఉన్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టడంతో పాటు.. ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. నూతన కాలనీలకు సైతం అందించేందుకు ఇప్పటికే ప్రణాళికలు పూర్తయ్యాయని తెలిపారు. కాలనీలలో ప్రభుత్వ స్థలాలు పార్కులు కబ్జాలు గురికాకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య విషయంలో ప్రజలకు ఇబ్బందులకు తలెత్తకుండా నూతన సిబ్బందిని సైతం నియమిస్తున్నట్లు తెలిపారు. నూతన కాలనీలు ఏర్పడడంతో విద్యుత్ డిమాండ్ పెరిగిందని.. ఇందుకు అనుగుణంగా నూతన సబ్ స్టేషన్లతోపాటు పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు మాట్లాడటం తన నైజం అని.. మిగతా సమయం ప్రజల అభివృద్ధి సంక్షేమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

అభివృద్ధిలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని అవసరమైన నిధులు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

అతి త్వరలో బీరంగూడలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనన్నట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి నేరుగా ఎమ్మెల్యేనే స్వయంగాతమ కాలనీలకు రావడం పట్ల ఆయా కాలనీల ప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు బాలరాజు, కృష్ణ, యూనుస్, ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్ డిఈ వెంకటరమణ, జలమండలి డిజిఎం శివకుమార్, విద్యుత్ శాఖ ఏడి సంజీవ్, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





## అధ్వానంగా జూరాల కుడి, ఎడమ కాలువలు

**కాల్వల్లో పారుతున్న నిర్లక్ష్యం!**

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(ప్రభాత ఉదయం): జూరాల ప్రాజెక్టు పై ఆదారపడి ఉన్న సాగునీటి సరఫరాకు వినియోగించే కుడి, ఎడమ కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కాలువల్లో పిచ్చిమొక్కలు, చెట్లు మొలిచి, పూడిక పేరుకుపోయి అధ్వానంగా కనిపిస్తున్నాయి. వర్షాలకు గండ్లు పడటం, లైనింగ్ చేయక ఏటా మరమ్మతులకు గురవుతున్నాయి. కాలువల నిర్వహణపై సరిగా పట్టించుకోవడం లేదు. ప్రతి యేటా జూరాల ప్రాజెక్టు అధికారులు కుడి,ఎడవ కాల్వల మరమ్మతుల కోసం అంచనాలు తయారు చేసి పంపుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కంటి తుడుపుగా కొన్ని నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో ప్రధాన సమస్యలు పెరిగి పెద్దవవుతున్నాయి. దీంతో కాల్వల మనుగడే ప్రశ్నార్థకమైంది. ఈ విషయంలో అధికారులు సైతం చేతులెత్తేస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే తప్పా మరమ్మతులు చేయించలేమని వారు చెబుతున్నారు. ప్రభుత్వ తీరుపై ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం కాల్వలను పర్యవేక్షిస్తూ లోటుపాట్లను సరిచేయాల్సిన బాధ్యతను విస్మరిస్తుండంపై వారు ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**వేసవికలో మరమ్మతులకు అవకాశం**

వేసవికాలంలో జూరాల ఆయకట్టుకు అధికారులు విరామాన్ని ప్రకటిస్తారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు లేకపోవడంతో రైతులు ఎవరూ పంటలు వేసుకోవద్దని సూచిస్తారు. దీంతో నీటి సరఫరాను పూర్తిగా నిలిపి వేస్తారు. మూడు, నాలుగు నెలల పాటు జూరాలకు సంబంధించి ఏ చిన్న కాల్వలోనూ చుక్క నీరు కనిపించదు. ఈ సమయంలోనే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో అది జరగటం లేదు. ప్రమాదకరంగా తయారైన చోట్లను గుర్తించి వాటిని సరి చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వం మరిచిపోయింది.

**మురుగు కాలువలను తలపిస్తున్న కుడి కాలువ**

గద్వాల పట్టణంలో ప్రవహిస్తున్న జూరాల ప్రాజెక్టు కుడి కాలువ సరైన నిర్వహణ లేక మురుగు కాలువలను తలపిస్తున్నాయి. జూరాల కుడి కాలువ ద్వారా గద్వాల పట్టణ ప్రజలకు త్రాగు నీరు, గద్వాల, అలంపూర్ నియోజకవర్గంలోని పంట పొలాలకు సాగు నీరందిస్తున్నారు. జూరాల కుడి కాలువలో ఏళ్ల తరబడి పూడికతీత, మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల కాలువల్లో చెత్తాచెదారం, గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పెరిగిపోయి నీరు ప్రవహించకుండా అడ్డుపడుతున్నాయి. చెనుగోనిపల్లిరోడ్డు,భీంనగర్, రెవెన్యూ కాలనీ , పాత హౌసింగ్ బోర్డు, బీరొల్లు రోడ్డు, జమ్మిచేడు వరకు గద్వాల పట్టణంలో ప్రవహిస్తున్న జూరాల కుడికాలువలో నిత్యం ప్లాస్టిక్ కవర్లు, చెత్తచెదారం, వ్యర్థపదార్థాలు పారవేయడంతో కుడి కాలువ నిండా చెత్తచెదారంతో నిండుకపోయింది. జమ్ములమ్మ రిజర్వాయర్ నుంచి గద్వాల పట్టణ ప్రజలకు త్రాగు నీరందించే కుడి కాలువలో భీంనగర్ , రెవెన్యూ కాలనీ, పాత హౌసింగ్ బోర్డు కాలనీ ల నుంచి డ్రైనేజి నీళ్లు కుడికాలువలో ప్రవహిస్తున్నట్లు ఆరోపణలు. ఇదే కుడి కాలువ నీరు ఫిల్టర్ చేసి త్రాగునీరందిస్తున్నారు. అలాగే పలు చోట్ల కుడి కాలువ ధ్వంసం కావండతో పొలాలకు అందాల్సిన సాగునీరు వృథాగా పోతుండడంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేసవి కాలంలో కాలువలోని చెత్త చెదారాని తొలగించి, కాలువ మరమ్మతులు చేయాలని రైతులు పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్న ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం చర్య లు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.



## ఇరుకుగా మారుతున్న రెవెన్యూ కాలనీ రోడ్డు...

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(ప్రభాత ఉదయం)

గద్వాల పట్టణంలోని భీంనగర్ ప్రధాన రోడ్డు నుంచి రెవెన్యూ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డులో గల పలు వీధుల్లో కొంతమంది రోడ్డును ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న గృహ నిర్మాణదారులు రోడ్డు సగం వరకు ఆక్రమించి ర్యాంపులు (మెట్లు), వాహనాల పార్కింగ్ నిర్మించుకుంటున్నారు. ఫలితంగా రెవెన్యూ కాలనీ రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ హైస్కూక్, ప్రైవేటు ఆసుపత్రులు ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించడంతో ర్యాంపు ఉన్న ఇంటిని దాటి కారు లాంటి వాహనం వెళ్లాలంటే అతి కష్టం మీద వెళ్లాల్సిన పరిస్థితి. ఒక్కోసారి వాహనాల ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి అక్రమ నిర్మాణాలపై స్థానిక ప్రజాప్రతినిధులు చూస్తున్నా తమ ఓటు బ్యాంకు కోసం మిన్నకుండా ఉండిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇకపోతే మునిసిపల్ వార్డు అధికారుల అలసత్వం కూడా ఉన్నట్లు మరికొంతమంది చెబుతున్నారు. ఏది ఏమైనా రోడ్డు, మునిసిపల్ స్థలాలను పరిరక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యంగానే ఇలాంటి ఆక్రమణలు జరుగుతున్నాయని పట్టణ ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలకు జరిగినట్లు రుజువైతే సుమోటోగా తీసుకొని అక్రమ నిర్మాణాలను తొలిగించాలని కోరుతున్నారు.



# గద్వాల మున్సిపాలిటీలో నిరంతర తాగునీటి సరఫరాకు శ్రీకారం

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(ప్రభాత ఉదయం): గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తోందని గద్వాల మున్సిపల్ చైర్మన్ తుమ్మల జయలక్ష్మీ నర్సింహులు యాదవ్ అన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం గద్వాల మున్సిపాలిటి పరిధిలోని భీంనగర్ లో త్రాగు నీటి పైప్ లైన్ నిర్మాణ పనులు మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. కృష్ణానదీ అగ్రహారం నుండి గద్వాలకు సరఫరా చేసే ప్రధాన త్రాగునీటి పైప్ లైన్ కు కొత్తగా నిర్మించే పైప్ లైన్ అనుసంధానం చేసి పాత హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ కు అనుసంధానం చేయనున్నట్లు చైర్మన్ తెలిపారు. అలాగే భీంనగర్, రెవెన్యూ కాలనీ, కాలనీలకు నిరంతర తాగునీటి సరఫరాను అందించేందుకు ప్రతిష్టాత్మకమైన తాగునీటి పైప్ లైన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ పైప్‌లైన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. పట్టణ ప్రజలు ఈ నిర్మాణ పనులకు సహకరించాలని కోరారు. చైర్మన్ వెంటా కౌన్సిలర్లు వేదావతి వెంకటేశ్వర్ రెడ్డి, నాగులుయాదవ్, శేఖర్, నాయకులు నరహరిగౌడ్, తిరుమల్ రెడ్డి ఉన్నారు.

